పేద విద్యార్థుల కోసం.. 'పీఎం యశస్వి'

- కేంద్ర ప్రభుత్వ.. వినూత్న ఉపకార వేతన పథకం
- 9, 10 తరగతి విద్యార్థులకు ఉపయుక్తం
- ఆగస్టు 26 వరకు దరఖాస్తుకు అవకాశం


కొల్లిపర మండలంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు (ఫైల్ ఫోటో)

కొల్లిపర: పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం యశస్వి పథకాన్ని ప్రవేశపెట్టింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల కలలను ఈ పథకం ద్వారా నెరవేర్చుకునే వీలుంది. ప్రతిభ ఉండి నిస్సహాయ పరిస్థితుల్లో చదువును మధ్యలో ఆపేసి ఉపాధి బాట పట్టే వారి కోసం కేంద్ర ప్రభుత్వం ఓ వినూత్న కార్యక్రమానికి పీఎం యశస్వి పేరుతో గతేడాది రూపకల్పన చేసింది. యశస్వి అంటే 'యంగ్ ఆచీవర్స్ స్కాలర్ షిప్ అవార్డ్ స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా' అని అర్థం. ఇప్పటి వరకు ఉన్న అతి పెద్ద ఉపకార వేతన పథకాల్లో పీఎం యశస్వి కూడా ఒకటి అని చెప్పవచ్చు. కేంద్ర ప్రభుత్వం సామాజిక న్యాయ, సాధికారిక మంత్రిత్వ శాఖ పరిధిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ఈ పథకానికి ఆధ్వర్యం వహిస్తోంది.

పథకానికి అర్హతలు..

- 8వ తరగతి పూర్తి చేసి ఉండాలి.
- తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.5లక్షలకు మించి ఉండరాదు. గ్రామాల్లోని నిరుపేదలు, రైతులు, అణగారిన కుటుంబాల్లోని విద్యార్థులకు ప్రాధాన్యమిస్తారు.
- ఓబీసీ, ఈబీసీ చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- 9వ తరగతిలో దరఖాస్తు చేసుకునే వారు 2004 ఏప్రిల్ 1 నుంచి 2008 మార్చి 31లోపు జన్మించి ఉండాలి.
- 9, 10 తరగతులు పూర్తయిన వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి మిగిలిన సంవత్సరాలకు(ఇంటర్ వరకు)మాత్రమే స్కాలర్ షిప్ లభిస్తుంది.
- కేంద్ర విద్యాశాఖ అధికారి ఎన్‌టీఏ వెబ్‌సైట్ లో నిర్వహించే యశ్వస్వి ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలి.



పీఎం యశస్వి ఆన్‌లైన్ లోగో

ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఇలా..

ప్రవేశ పరీక్షకు ఎన్‌టీ (yet.nta.ac.in) వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలి. పేరు, ఈ-మెయిల్, పుట్టిన తేదీ, పాస్‌వర్డ్ తదితర వివరాలతో ఓ ఖాతాను క్రియేట్ చేసుకోవాలి. తర్వాత దరఖాస్తుదారునికి అప్లికేషన్ నంబరు వస్తుంది. అదే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నంబరు, పాస్‌వర్డ్‌తో లాగిన్ కావాలి. చదువు, గుర్తింపు కార్డు, దరఖాస్తుదారుని పూర్తి వివరాలు, కుటుంబ వివరాలు, తదితర డాక్యుమెంట్ల సాఫ్ట్ కాపీలను అప్‌లోడ్ చేసి సైన్ అప్ కావాలి. దరఖాస్తు ప్రక్రియ పూర్తయిన తరువాత పరీక్ష కోసం హాల్ టికెట్ జారీ చేసే తేదీ తదితర వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లో పరిశీలించుకోవాలి. ఆన్‌లైన్‌లో తెలిపిన ప్రకారం పరీక్షలు రాయాలి.

పరీక్ష ఇలా..

మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు కొనసాగే పరీక్షను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో నిర్వహిస్తారు. ప్రవేశ రుసుం లేదు. 100 అబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. గణితంలో 120 మార్కులకు 30 ప్రశ్నలు, సైన్సులో 80 మార్కులకు 20 ప్రశ్నలు, సోషల్‌లో 100 మార్కులకు 25 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్‌లో 100 మార్కులకు మరో 25 ప్రశ్నలుంటాయి. దేశవ్యాప్తంగా 78 ప్రధాన నగరాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తారు. గతేడాది సెప్టెంబరు 11న అర్హత పరీక్ష నిర్వహించారు. ఏప్రిల్ 15 నుంచి ఈ ఏడాది ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా, ఆగస్టు 26తో దరఖాస్తు ప్రక్రియ పూర్తి కానుంది.

ఉపకార వేతనం ఇలా..

9, 10 తరగతులకు ఏటా రూ.75వేలు, ఇంటర్మీడియట్ లేదా 11, 12 తరగతులకు ఏటా రూ.1.25 లక్షల ఉపకార వేతనం ఒకేసారి ప్రభుత్వం అందిస్తుంది.

అర్హత సాధించిన తర్వాత ఇలా..

విద్యార్థులు మళ్లీ ఉపకార వేతనం కోసం అదే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఏ బ్యాంకు ద్వారా నగదు పొందాలనుకుంటారో ఆ బ్యాంకు పాస్ పుస్తకం, ఫొటో కాపీని జత చేయాలి. ఉపకార వేతనం నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. వీటితో కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల, కళాశాలలో విద్యార్థులు విద్యనభ్యసించవచ్చు.

పేరంటాలమ్మ తిరునాళ్లకు పోటెత్తిన జనం


ఉత్సవ అలంకరణలో శ్రీవెంకయ్య-గౌరమ్మ విగ్రహాలు


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పట్టణంలోని అయితా నగర్‌లో పేరంటాలమ్మ తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, సోదరుడు అన్నాబత్తుని శ్రావణ్ కుమార్‌తో కలిసి శుక్రవారం ఉదయం ఆలయానికి చేరుకున్నారు. శ్రీ వెంకయ్య-గౌరమ్మలను దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. ప్రత్యేక పూజలో పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే శివకుమార్‌కు స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. తిరునాళ్లలో చివరిరోజు ఆలయం వద్ద ఉత్సవ సంరంభం నెలకొంది. వేలాదిగా భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం నుంచి పొంగళ్లు పెట్టుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో భాగంగా గండ దీపాలు, పసుపు బండ్లు, విద్యుత్ ప్రభలు, మేకశిడి వంటి సంప్రదాయ వేడుకలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. ఎక్కడెక్కడో స్థిరపడ్డ ఆ గ్రామస్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. కోర్కెలు నెరవేరినవారు మొక్కులు తీర్చుకున్నారు. వంశపారంపర్య ధర్మకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఎమ్మెల్యేతో వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల నేతలు



తెనాలిరూరల్: పట్టణంలోని గంగానమ్మ పేట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. జిల్లా దివ్యాంగ విభాగం అధ్యక్షుడు నూర్ బాషా అల్లాభక్షు, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు మాదా రాధాకృష్ణమూర్తి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మడా వెంకటేశ్వర్లు తదితరలున్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 నియోజక వర్గాల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

తెనాలి వైద్యశాల తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

తెనాలి రూరల్: జోనల్ మలేరియా అధికారి డాక్టర్ బి.వినోద్ కుమార్ తెనాలి జిల్లా వైద్యశాలను శుక్రవారం సందర్శించారు. అక్కడ వివిధ విభాగాలను పరిశీలించారు. ముఖ్యంగా ల్యాబ్, పాథాలజీ, మైక్రో బయాలజీ, మలేరియా ల్యాబ్‌లను తనిఖీ చేసి, తగు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం తెనాలి పట్టణంలోని మోరిస్‌పేటను సందర్శించి, అక్కడ 'ఫ్రైడే డ్రై డే' కార్యక్రమంలో పాల్గొన్నారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రజలు నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సూచించారు. మోరిస్‌పేట వైద్యాధికారి డాక్టర్ మేరీ, అసిస్టెంట్ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ మంగరాజు, శ్రీకంఠ ఉమాకాంత్, ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మీనరసయ్య, ఫైలేరియ జూనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఆరోగ్య పర్యవేక్షకులు నడికోట శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు పి.నాగరాజుకుమార్, రత్నాకర్, రషీద్, నవీద్, వాణి తదితరులు ఉన్నారు.

వైభవంగా 'కొలంకపురి' నాటిక పోటీలు ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్


'మనిషి మంచోడే' నాటికలో సన్నివేశం


'మనసున మనసై' నాటికలో సన్నివేశం

కొలకలూరు(తెనాలి): తెనాలి రూరల్ మండలం కొలకలూరులో కొలంకపురి నాటక కళా పరిషత్ తెలుగు రాష్ట్రాల స్థాయి నవమ ఆహ్వాన నాటికల పోటీలు శుక్రవారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ జ్యోతి ప్రజ్వలనతో ఆరంభమయ్యాయి. గ్రామంలోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయం ఎదుట ప్రత్యేక వేదికపై ప్రారంభ సభకు పరిషత్ అధ్యక్షుడు, ప్రముఖ సినీ నటుడు గోపరాజు రమణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ కవులు, కళాకారులు, రచయితలకు నిలయమైన కొలకలూరు వారసత్వాన్ని నేటి తరానికి తెలియజేసేలా నాటిక పోటీలను నిర్వహిస్తున్న పరిషత్ నిర్వాహకులను అభినందించారు. తెనాలి ప్రాంతానికి రాజకీయ నేతలతో కాకుండా కళా, సాహితీ, సాంస్కృతిక రంగాల ప్రముఖుల తోనే ఖ్యాతి లభించిందని గుర్తుచేశారు. అనువైన స్థలం పరిశీలించి కళావేదిక నిర్మాణానికి ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.10 లక్షలను కేటాయిస్తానని సభా ముఖంగా ప్రకటించారు. గోపరాజు విజయ్ స్వాగతం పలికిన సభలో ఉపాధ్యక్షుడు సుద్దపల్లి మురళీధర్, గొడవర్తి శ్రీనివాసమూర్తి ప్రసంగించారు. తొలి ప్రదర్శనగా కళాంజలి, హైదరాబాద్‌వారి 'మనిషి మంచోడే' నాటికను ప్రదర్శించారు. స్వర్గీయ కాటా సుబ్బారావు రచనకు జెట్టి హరిబాబు దర్శకత్వం వహించారు. ప్రధాన పాత్రల్లో డి.మహేంద్ర, ఎస్.మాధవి, కె.రాధాకృష్ణ, జీఎస్ చలపతి, జె.హరిబాబు నటించారు. అనంతరం హేలాపురి కల్చరల్ అసోసియేషన్, ఏలూరు వారి 'మనసున మనసై' నాటికను ప్రదర్శించారు. 'మన పిల్లలతో అమ్మానాన్నలను ఆడుకోనిద్దాం ...వాళ్లు ఆనందపడతారు. మన అవసరాల కోసం అమ్మానాన్నలను వాడుకోవద్దు' అంటూ బిడ్డలకు హితోక్తి పలికిందీ నాటిక. ప్రధాన పాత్రల్లో పి.విజయకుమార్, వైకే భవాని, వై.ప్రణీత్, శీరం శ్రీనివాసరావు నటించారు. చింతల మల్లేశ్వరరావు, పి.కృష్ణ హితేష్ రచనకు మహ్మద్ ఖాజావలి దర్శకత్వం వహించారు.

ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ హెనీ క్రిస్టినా

బాపట్లఅర్బన్: బాపట్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయం రికార్డులను పరిశీలించారు. మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. జిల్లా పరిషత్ స్థలాలను పరిరక్షించాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పిన్నిబోయిన ఎస్తేరు రాణి, వైస్ ఎంపీపీ కుర్రా రమాదేవి చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాను ఘనంగా సత్కరించారు.

క్లుప్తంగా

సాయి బాబాకు లక్ష మల్లెలతో పూజ



తెనాలిటౌన్: ముత్తెంశెట్టి పాలెంలోని సాయిబాబా మందిరంలో వైశాఖ పూర్ణిమ సందర్భంగా శుక్రవారం లక్ష మల్లె పూలతో పూజలు నిర్వహించారు. సాయిబాబా మందిర సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులు విశేష పూజలు చేశారు. వేద పండితులతో సాయి సహస్రనామావళి పారాయణం జరిపారు. సుమారు 73 సంవత్సరాల క్రితం మందిరాన్ని నిర్మించామని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మందిర సేవా సమితి సభ్యులు పర్యవేక్షించారు.

కళాకారుడు బసవయ్యకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం తీర్పు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు కుర్రా బసవయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మద్ది మల్లికార్జునరావు, అప్పల కిషోర్, బొప్పన సురేంద్ర, గౌతం శ్రీనివాస్, పెమ్మసానీ పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవానీ, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, సోమవరపు సాంబశివరావు, దేవిశెట్టి భాస్కర్, ముళ్ళపూడి వెంకట్, గుమ్మడి ప్రసాద్, నల్లూరి శ్రీనివాస్, నరసయ్య పాల్గొన్నారు.

వర్గీకరణకు అనుకూల ప్రకటన చేయాలి

తెనాలిరూరల్: ఈ నెల 7న హైదరాబాద్ పర్యటనకు వస్తున్న బీఎస్పీ అధినేత్రి కుమారి మాయావతి ఎస్సీ వర్గీకరణకు అనుకూల ప్రకటన చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా కో-కన్వీనర్ ధనరావులపల్లి కిషోర్ మాదిగ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమైందేనని బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు గతంలోనే తమ వైఖరిని తెలిపాయని, అదే విధంగా బీఎస్పీ స్పష్టత ఇవ్వాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

కార్ల్ మార్క్స్‌కు నివాళి



తెనాలిరూరల్: జర్మన్ శాస్త్రవేత్త, తత్వవేత్త కార్ల్ మార్క్స్ 205 జయంతి సందర్భంగా సీపీఐ నాయకులు స్థానిక నందుల పేటలోని పార్టీ కార్యాలయంలో కార్ల్ మార్క్స్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పార్టీ సీనియర్ నాయకుడు బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక వేత్తగా, పాత్రికేయుడిగా, సోషలిస్టు విప్లవ కారుడిగా చరిత్రలో నిలచిపోయిన మహనీయుడు కార్ల్ మార్క్స్ అని తెలిపారు. సమాజం, ఆర్థిక శాస్త్రం, రాజకీయాలపై మార్క్స్ సిద్ధాంతాలను కలగలిపి మార్క్సిజంగా పిలుస్తారని తెలిపారు. ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.గురుబ్రహ్మం, కార్యదర్శి పల్నాటి నాగ రాజు పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్న ఘటన ఉయ్యూరువారిపాలెం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. సెబ్ సీఐ లీనా వివరాల మేరకు.. తమకు అందిన సమాచారంతో ఉయ్యూరువారి పాలెం గ్రామంలో దాడులు నిర్వహించగా.. గ్రామానికి చెందిన వి.లక్ష్మీదేవి అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడిందని సీఐ తెలిపారు. 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, నిందితురాలిని కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు సిద్ధం

వేమూరు: వేమూరు నియోజకవర్గంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.1962లకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులందరూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో పంటను అమ్ముకోవాలని పేర్కొన్నారు. వర్షాలు వల్ల దెబ్బ తిన్న మొక్కజొన్న పంటకు నష్ట పరిహారం కూడా అందిస్తోందని పేర్కొన్నారు.

12న పాత వాహనాల వేలం

బాపట్ల: బాపట్ల జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఉన్న పాత వాహనాలను వేలం వేయనున్నట్లు ప్రధాన కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 12న వేలం పాట ఉంటుందని, వివరాలకు 91211 02226 సంప్రందించాలని తెలిపారు.

పవర్ లిఫ్టింగ్‌లో తెనాలి యువతికి బంగారు పతకాలు


జాతీయ పతాకంతో షబీనా

తెనాలిరూరల్: కేరళలో జరుగుతున్న ఏషియన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తెనాలి యువతి షేక్ షబీనా బంగారు పతకాలు సాధించింది. స్క్వాట్ 172.5 కిలోల విభాగం, బెంచ్‌ప్రెస్ 75 కిలోలు, డెడ్ లిఫ్ట్-160 కిలోల విభాగాల్లో బంగారు పతకాలు సాధించినట్టు కోచ్ సంధాని శుక్రవారం తెలిపారు. మొత్తంగా 407.50 కిలోలు ఎత్తి మూడు బంగారు పతకాలు కై వసం చేసుకుంది. తెనాలికి చెందిన షబీనా మంగళగిరి ఫిట్‌జోన్ జిమ్‌లో కోచ్ సంధాని వద్ద శిక్షణ తీసుకుంటోంది. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి పుల్లేశ్వరరావు, ఆంధ్ర ప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి సకల కోటేశ్వరరావు, క్రీడా ప్రముఖులు ఈ సందర్భంగా షబీనాను అభినందించారు.

అంగరంగ వైభవంగా దివ్య జంట రథోత్సవాలు


పుర వీధుల్లో దివ్య జంట రథోత్సవాలు

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరంలో కొలువైన మార్కండేయ ఈశ్వర భద్రావతి సమేత భావనా రుషి స్వామి, భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం దివ్య జంట రథోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. కల్యాణ మూర్తులైన స్వామి వార్లను పురవీధుల్లో ఊరేగించారు. హోమం, బలిహరణ అనంతరం రథోత్సవాలు ముందుకు సాగాయి. భక్తులు అడుగడుగునా స్వామి వార్లకు బ్రహ్మరథం పట్టారు. స్వామి వార్ల దివ్య జంట రథోత్సవాలను వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. కల్యాణ మహోత్సవాలు పురస్కరించుకుని ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. దీపాల సత్యన్నారాయణ సారథ్యంలో గౌరీశంకర భక్త సమాజం భజన సంకీర్తనలు జరిగాయి. ప్రసాదాలను మాచర్ల దేవ సురేష్ బాబు -శ్రీదేవి దంపతులు అందించారు. జంట దివ్య రథాలు ఒక్కసారిగా ఎదురెదురుగా రావడంతో భక్తులు దిక్కులు పిక్కటిల్లేలా జై మార్కండేయ.. జై భావనారుషి అంటూ నినాదాలు చేశారు. బాణ సంచా, తారా జువ్వలు వెలిగించారు. రథోత్సవంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాన్స్‌కో ఏడీఏ ఎన్. భాస్కరరావు పర్యవేక్షణలో ఏఈ ఏడుకొండలు, విద్యుత్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. వేమూరు సీఐ కె.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో భట్టిప్రోలు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ బందోబస్తు నిర్వహించారు. శనివారం అన్న సంతర్పణ చేయనున్నారు. పెద్ద శ్రేష్ఠులు దీపాల అవినాష్, డాక్టర్ కొతరపు వెంకటేష్, కొతరపు శ్రీనివాసరావు, పెత్తందార్లు కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



మున్నంగి(కొల్లిపర): ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, తద్వారా దోమల వ్యాప్తిని నివారించవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ అన్నారు. శుక్రవారం మున్నంగి గ్రామంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి నిల్వల్లో ఎబేట్ మందును పిచికారి చేయించారు. ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, పీహెచ్ఎన్ కోటేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ నాగమల్లేశ్వరరావు, ఏఎన్ఎం ఎం.పులికుసుమ, ఆశ కార్యకర్తలు శివలీల, సుజాత, వనజ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసులు నమోదు

తెనాలిరూరల్: కట్నం వేధింపులపై రెండు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుకు చెందిన గొండిపాటి అజితకు 2012లో ప్రభు కిషోర్‌తో వివాహమైంది. ఇటీవల భర్త మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. అలానే చినరావూరు తోట ప్రాంతానికి చెందిన అత్తలూరి లక్ష్మీతిరుపతమ్మ తనను భర్త లక్ష్మణ్ వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. రెండు కేసులను వన్‌టౌన్ పోలీసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి ఉన్న ఇద్దరి అరెస్ట్

తెనాలిరూరల్: గంజాయి కలిగి ఉన్న ఇద్దరిని త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. తెనాలి పట్టణ యడ్ల లింగయ్య కాలనీ సమీపంలో కొబ్బరి తోటల వద్ద ఇద్దరు యువకులు గురువారం రాత్రి అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు వారిని అదపులోకి తీసుకుని, విచారించారు. ఆ యువకులను పట్టణానికి చెందిన గుర్రం విజయ్, గరిక సురేష్‌గా గుర్తించారు. ఇద్దరి వద్ద అరకిలో గంజాయి లభించడంతో అరెస్ట్ చేసి కోర్టులో శుక్రవారం హాజరుపరిచారు.

సొసైటీ అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని వినతి


సొసైటీ అధ్యక్షుడు దేవిడ్‌రాజ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న సభ్యులు

బాపట్ల: దగ్గుమల్లివారి పాలెం ఆది ఆంధ్ర కో-ఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీ అధ్యక్షుడు గుండాల విజయ్ డేవిడ్‌రాజ్‌పై చర్యలు తీసుకోవాలని సొసైటీ సభ్యులు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాకు, ఎమ్మెల్యే కోన రఘుపతికి ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం సొసైటీ సభ్యులు వినతి పత్రం అందించి, అనంతరం మాట్లాడారు. 20 ఏళ్ల నుంచి కూలీగా నటించి, సొసైటీ ఖాతా నుంచి జాతీయ రహదారి అధికారులు నష్ట పరిహారంగా ఇచ్చిన నగదు రూ.1.35కోట్లను దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విజయ్ డేవిడ్‌రాజ్‌పై విచారణ చేపట్టాలని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సొసైటీ సభ్యులు అడే రవికుమార్, దగ్గుమల్లి ధర్మారావు తదితరులు ఉన్నారు.

వైభవంగా సిడిమాను ఉత్సవం

ప్రత్యేక పూజలు చేసిన ఎంపీ మోపిదేవి


అమ్మవారికి మొక్కుకుంటున్న పంపీ మోపిదేవి దంపతులు

నిజాంపట్నం: వేలాది మంది భక్తుల నడుమ విద్యుత్ దీపాల అలంకరణతో సిడిమాను ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. నిజాంపట్నంలోని శ్రీ మొగదారమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా గ్రామ వీధుల్లో శుక్రవారం ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు అడుగడుగునా సిడిమానుకు పూజలు నిర్వహించి, తమ భక్తిని చాటుకున్నారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు దంపతులు సిడిమానుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొగదారమ్మ తల్లి ఆలయంలో పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించి, నైవేద్యాలను సమర్పించారు. ఉత్సవాల్లో వేలాదిమంది భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాగణం భక్తులతో పోటెత్తింది. సాంస్కృతిక కార్యక్రమాలు స్థానికులను విశేషంగా ఆకట్టున్నాయి. కార్యక్రమంలో జబర్దస్త్ బృందం సభ్యులు ఫైమా, గడ్డం నవీన్, శాంతి కుమార్‌తో పాటు పలువురు సింగర్స్ పాల్గొని, ప్రదర్శనలిచ్చారు. ప్రజలు భారీగా తరలివచ్చి సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.

చేనేత, హస్త కళా ఉత్పత్తుల ప్రదర్శన ప్రారంభం


చీరలు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ ఎస్తేరురాణి

బాపట్ల: బాపట్ల పట్టణంలోని టీటీడీ కల్యాణ మండలంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ ప్రదర్శనలు ఆకట్టుకునేవిధంగా ఉన్నాయని జెడ్పీటీసీ పిన్నిబోయిన ఎస్తేరురాణి పేర్కొన్నారు. హ్యాండ్లూమ్, హ్యాండి క్రాఫ్ట్స్ ప్రదర్శనను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్తేరు రాణి మాట్లాడుతూ చేనేత హస్తకళలకు చేయూతనిచ్చి.. సాంప్రదాయాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. పోచంపల్లి, నారాయణపేట్, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్‌తో పాటు ఎన్నో హస్తకళలను ప్రదర్శనతోపాటు అమ్మకానికి ఉంచారు. ఈ నెల 5 నుంచి 21వ తేదీ వరకు విక్రయాలు ఉంటాయని, వీటిని ఉపయోగించుకుని కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు.